# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

తేది : ఆగస్టు 15, 2015

### సి.పి.ఐ. (మావోయిస్టు) 11వ వార్షికోత్సవానికి విప్లవ జేజేలు.

### పార్టీని పటిష్టపర్చుకుంటూ విప్లవ ప్రజా కమిటీలను బలోపేతం చేసుకుంటూ విస్తరిద్దాం!

### సెప్టెంబర్ 21వ తేదీ నుంచి 27 వ తేదీ వరకు వారం రోజుల పాటు

### పార్టీ వార్షికోత్సావాన్ని విప్లవోత్సాహంతో దేశమంతటా జరపండి!!

2004 సెప్టెంబర్ 21, భారత విప్లవోద్యమ చరిత్రలో నూతనాధ్యాయానికి నాంది పలికింది. మన నూతన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భవించి 2015 సెప్టెంబర్ 21కి 11 సంవత్సరాలు పూర్తవుతున్నాయి. గత సంవత్సరం దేశవ్యాప్తంగా మన పార్టీ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా, విప్లవ దృఢసంకల్పంతో జరుపుకుంది. అంతర్జాతీయంగా అనేక మవోయిస్టు విప్లవ సంస్థల నుంచి అపూర్వ స్థాయిలో విప్లవ సంఘీభావం వ్యక్తమైంది. మన దేశంలోని విప్లవ మేధావులు, రచయితలు, కళాకారులు, పాత్రికేయులు, విద్యావేత్తలు, న్యాయవాదులు ఇతరత్రా అనేక సెక్షన్‌లకు చెందిన విప్లవాభిమానులు శత్రు అణచివేత దాడుల మధ్య పార్టీ దశాబ్ది ఉత్సవాల్లో ఉత్సాహంగా, బాధ్యతాయుతంగా పాల్గొన్నారు. వారందరికీ మా పార్టీ కేంద్రకమిటీ విప్లవాభివందనాలు తెలుపుకుంటున్నది.

పార్టీ సంస్థాపక నాయకులు కామ్రేడ్ చారుమజుందార్, కన్హాయ్ ఛటర్జీ లకు, నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలో తమ అసువులు బాసిన వేలాది వీర యోధులకు కేంద్ర కమిటీ విప్లవ జోహార్లు అర్పిస్తున్నది. ఈ సంవత్సర కాలంలో వందకు పైగా మన ప్రియమైన సహచరులను శత్రువు కొనసాగించిన పాశవిక హంతక దాడులలో మనంకోల్పోయాం. (వీరిలో గ్రామీణ విప్లవ ప్రజానీకం కూడా ఉన్నారు.) పాతతరం సీనియర్ కామ్రేడ్స్ ఒక్కొక్కరు భౌతికంగా దూరం కావడం మన పార్టీకీ, విప్లవోద్యమానికీ తీవ్ర లోటుగానే ఉంటున్నది. వారి అనేక అనుభవాల ద్వారా మనకు ఎంతో అండ దొరికేది. అలాంటివారిలో ఈ మధ్య జూలై 25 నాడు తుది శ్వాస విడిచిన కా. చలసాని ప్రసాద్ ఒకరు. ఆయన ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ రోజుల నుంచీ మావోయిస్టు పార్టీ ఏర్పడి దశాబ్ది ఉత్సవాలు జరుపుకునే వరకూ మా.లె.మా. జెండాను సమున్నతంగా ఎత్తిపడుతూ అరుణారుణా రాజకీయాల కోసం తన జీవితాన్ని అంకితం చేసినవాడు. ఆయన, ఆయన లాంటివారు మన మధ్య భౌతికంగా లేకపోయినా వారి ఆశయాలు, ఆదర్శాలు నిత్యం మనల్ని వెన్నుతడుతుంటాయి. కేంద్రకమిటీ ఈ సందర్భంగా మన మధ్య భౌతికంగా లేని వారందరికీ వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లు అర్పిస్తోంది. వారి ఆశయాల సాధనకై తుదకంటా పోరాడుతామనీ ప్రతిజ్ఞ చేస్తోంది.

దోపిడీ పాలకవర్గాలు మన యావత్తు పార్టీనీ, విప్లవోద్యమాన్ని తుదముట్టించాలనే వినాశకర లక్ష్యంతో ఉవ్విళ్లూరుతూ బహుముఖ దాడిని మరింత తీవ్రం చేశాయి. కానీ ప్రపంచ విప్లవాల చరిత్రలో ఇలాంటి చర్యలు, దాడులు, కెంపెయిన్‌లు కొత్తవేమీ కావు. ఇలాంటివనేకం ఓడించడం ద్వారానే అంతిమంగా విప్లవోద్యమం జయప్రదమై తీరుతుందన్న వ్యూహాత్మక అవగాహనతోనే మన పార్టీ ధీటైన ఎత్తుగడలను రూపొందించుకుంటూ ప్రజాయుద్ధాన్ని పెంపొందింప చేస్తోంది. నిప్పురవ్వ దావానంలా మారుతుందనడానికి నగ్జల్బరీ తదనంతర విప్లవోద్యమ విస్తరణే మన ముందుంది. నిర్దిష్టంగా సి.పి.ఐ. (మావోయిస్టు) ఆవిర్భావం తర్వాత దేశంలోని మెజార్టీ రాష్ట్రాలకు మన విప్లవోద్యమం వేగంగా విస్తరించింది. విప్లవోద్యమ పురోగమన క్రమంలో గడ్డు పరిస్థితులు (ఆటు కాలాలు) ఎదురవడం సాధారణమే. వాటితో తలపడుతూ వాటిని అధిగమించడం విప్లవోద్యమాలకు అనివార్యమైనదే. ఈ క్రమం నుండే గెలుపు – ఓటమి – అంతిమంగా గెలుపు అనేది ఒక నియమంగానే చెప్పుకుంటున్నాం. ఈ నేపథ్యంలోనే గత కొద్ది సంవత్సరాలుగా మన పార్టీ దేశవ్యాప్తంగా ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులను చూడాలి. ఈ పరిస్థితుల నుండి బయటపడే క్రమంలో మన పార్టీ మరి కొన్ని తీవ్ర నష్టాలనే చవిచూసినప్పటికీ, ప్రధానంగా అనుకూలతలపై ఆధారపడి ప్రతికూలతలను అధిగమిస్తూ, లెనినిస్టు పని శైలీని అన్వయిస్తూ సకారాత్మక ఫలితాలు పొందుతున్నాం. ప్రతికూలతలను అధిగమిస్తూ అనుకూలతలను పెంచుకుంటున్నాం. వస్తుగతంగా దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ పెంపొందుతున్న విప్లవానుకూల పరిస్థితులు మన

పార్టీ చేస్తున్న కృషికి ఎంతగానో తోడ్పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితులలో మన కేంద్ర కమిటీ సభ్యుడు కా. మురళీధరన్ (అజిత్, వసంత్), ఆయన కోరియర్‌తో పాటు 2015 మే నెలలో పూనేలో, దానికి కొంత ముందు కేరళ రాష్ట్ర కమిటీ సభ్యుడు కా. ప్రవీణ్ తన సహచరి శైనాతో సహా ముగ్గురు తమిళనాడు రాష్ట్రకమిటీ సభ్యులు అరెస్టు కావడం పార్టీకి తీవ్ర నష్టదాయకమైనదే. మరీ ముఖ్యంగా పశ్చిమ కనుమలలోని ట్రై జంక్షన్‌లో నూతనంగా పురుడు పోసుకుంటున్న విప్లవోద్యమానికి పెద్ద నష్టమే.

పార్టీని బలోపేతం చేస్తూ, విప్లవోద్యమాన్ని పురోగమింప చేయడానికి పార్టీ బోల్షెవీకరణ కెంపెయిన్‌ను చేపట్టాలనీ మన కేంద్రకమిటీ పిలుపునిచ్చింది. మావో బోధించిన 'చేయుట ద్వారా చెప్పండి' సూత్రం వెలుగులో వ్యూహాత్మక నాయకత్వ శక్తులు లోతుగా ప్రజల మధ్యకు వెళ్లాయి. కేడర్లను అంటిపెట్టుకొని ఉన్నాయి. శత్రువు ప్రారంభించిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశలో ఎదురవుతున్న అనేక సవాళ్లను స్వీకరిస్తూ నాయకత్వ శక్తులు అన్ని రంగాలలో తమ శక్తియుక్తులను వెచ్చిస్తూ ప్రజా యుద్ధంలో పాల్గొని బహుముఖ ప్రతిఘటనను కొనసాగించాయి. సైద్ధాంతిక విషయాలకు మొదటి ప్రాధాన్యతను ఇస్తూ క్యాడర్లను 'మంచి కమ్యూనిస్టు – మంచి నిపుణులు' గా తయారు చేయడంపై పథకం ప్రకారం కృషి చేశాయి. పార్టీకి కేంద్ర స్థానం, విప్లవ కార్యకలాపాలు నిర్వహించే రంగస్థలమైన గ్రామీణ ప్రాంతంలో కొనసాగించిన గత యేడాది కాల కృషి ఫలితంగా కింద పేర్కొన్న విజయాలు సాధ్యపడినాయి.

1. కేడర్ల, నాయకత్వ శక్తుల సైద్ధాంతిక స్థాయిలో సాపేక్షిక మెరుగుదల సాధ్యపడింది.

2. ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం కొనసాగించిన ఎత్తుగడల ఎదురుదాడులలో పోలీసు, అర్థ సైనిక బలగాలకు చెందిన దాదాపు 80 మందికి పైగా ఖాకీలు మట్టికరిచారు. దాదాపు 175కు పైగా జవానులు గాయపడ్డారు. 27 ఆయుధాలు, దాదాపు 4,500 తూటాలు స్వాధీనమైనాయి. 2010 తర్వాత ఇవి మనం సాధించినమెరుగైన ఫలితాలుగా చెప్పుకోవచ్చు.

3. ప్రజాయుద్ధం ద్వారా పెంపొందుతున్న ప్రజల రాజ్యాధికారం పటిష్టీకరణలో భాగంగా అన్ని స్థాయిలలో మెజారిటీ జనతన సర్కార్లకు ఎన్నికలు జరిగాయి. వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతుల భూముల సమతలీకరణ, మళ్ల నిర్మాణం, నీటి పారుదల వ్యవస్థ నిర్మాణంలో రోజుల తరబడిగా వేలాది ప్రజలు సామూహికంగా పాల్గొన్నారు. 1,70,000 పని దినాలు శ్రమ చేసారు. పార్టీ కార్యకర్తలు, ప్రజా గెరిల్లాలు కూడా అందులో భాగమయ్యారు.

4. విప్లవ ప్రజాసంఘాల పటిష్టీకరణలో భాగంగానే వాటి మహాసభలను జరుపుకొని నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు.

5. గెరిల్లా జోన్‌లు, గెరిల్లా బేస్‌లలోని వేలాది మంది ప్రజానీకం విస్థాపనకు వ్యతిరేకంగా, కేంద్ర ప్రభుత్వ భూసేకరణ బిల్లుకు వ్యతిరేకంగా, రాజ్యహింసకు వ్యతిరేకంగా పోరాటాల్లోకి దిగారు.

6. పెంపొందుతున్న గెరిల్లా యుద్ధం, విప్లవ ప్రజా పోరాటాల ఫలితంగా ఈ సంవత్సరం ఎక్కువ సంఖ్యలో నూతన శక్తులు విప్లవోద్యమంలో భర్తీ అయ్యాయి.

పైన పేర్కొన్న విప్లవోద్యమ అనుకూల ఫలితాలు ఒకవైపూ, మరోవైపూ పశ్చిమ కనుమలలోని ట్రై జంక్షన్‌లో విప్లవోద్యమం కాలూనుకొని దేశ దక్షిణ ప్రాంతంలో ఒక కొత్త యుద్ధ ఫ్రంటును ఆవిష్కరించింది. అది 2015 జనవరి నాటికి మూడు మాసాల రాజకీయ – సైనిక కెంపెయిన్‌ను కొనసాగించి మంచి ఫలితాలు పొందింది. ట్రై జంక్షన్ నిర్వహించిన ప్రచార, ప్రతిఘటనా చర్యలు అక్కడి పీడిత ప్రజలకు ముఖ్యంగా యువతకు సాయుధ విప్లవ సందేశాలనందించాయి. వీర నక్సల్బరీ విప్లవోద్యమం కొనసాగిన కాలంలో కేరళంలో విప్లవ ప్రకంపనాల కేంద్రకంగా నిల్చిన వయానాడ్‌లో ఆదివాసీ ప్రజలచే 'అన్న'గా గౌరవం పొంది అమరుడైన కామ్రేడ్ వర్గీస్ వారసత్వాన్ని ఎత్తిపడుతూ పొటెత్తే కబనీ నది పోరు జ్ఞాపకాలను తిరిగి ఎజండా పైకి తెచ్చింది.

గత దశాబ్ద కాలంగా కర్ణాటక లోని మల్నాడ్ అటవీ ప్రాంతంలో విప్లవ ప్రతీఘాతకుల ద్రోహం, శత్రువు అణచివేత దాడులను తట్టుకొని కొనసాగుతున్న ఉద్యమానికి నేటి ట్రై జంక్షన్ ఉద్యమం కొత్త ఊపిర్లనందిస్తోంది. మల్నాడ్ ఉద్యమంలో తమ నులివెచ్చని నెత్తుర్లను ధారపోసిన కా. సాకేత్ రాజన్, కా. సందె రాజమౌళి లు సహా 16 మంది అమరుల ఆశయాల సాధనకై అంకితమైన ట్రై జంక్షన్ ఉద్యమం కా. షినోజ్ అమరత్వ సాక్షిగా భారత ప్రజాతంత్ర విప్లవ పురోగమనానికి దక్షిణ భారతంలో కృషి చేస్తోంది. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో బలపడుతూ విస్తరిస్తోన్న విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో ప్రారంభమైన ఆపరేషన్ గ్రీన్‌హంట్ ఇప్పటికే తూర్పున మహానదికి అడ్డుకట్టవేయాలని విఫల ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ దుద్వా, గంధమర్ధన్‌లను దాటిన విప్లవోద్యమం సరండాకు దారులు వేసింది. ఇప్పుడు కొత్తగా గ్రీన్‌హంట్ కేరళంలో తన అణచివేత దాడులను ముమ్మరం చేసింది. తుదకు విదేశీ పర్యాటకులను సైతం సహించకుండా మావోయిస్టులంటూ వేదించడంతో దేశ, విదేశాల్లో ఆపరేషన్ గ్రీన్‌హంట్ మరోమారు తీవ్ర ఖండనకు గురైంది. తమపై విరుచుకుపడిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ట్రై జంక్షన్ ప్రజలు కచ్చితంగా ఓడించి పురోగమించి తీరుతారు.

కామ్రేడ్స్!

భారత దోపిడీ పాలకవర్గాలు మన పార్టీనీ, మన పార్టీ నాయకత్వంలో బలపడుతూ పురోగమిస్తోన్న విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించడానికి వేగిరపడుతున్నాయి. వాటికి సామ్రాజ్యవాదులు పూర్తి అండగా నిలిచారు. గత 11 సంవత్సరాల కాలాన్ని పరిశీలిస్తే మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో యేటేటా పోలీసు, అర్ధ సైనిక బలగాల మోహరింపులు పెరుగుతూనే ఉన్నాయి. విప్లవోద్యమ ప్రాంతాల ప్రజలపై కొనసాగిస్తోన్న సైనిక దాడుల తీవ్రత పెరుగుతూనే ఉంది. మన పార్టీ 9వ కాంగ్రెస్ 'బేస్ ఏరియా' లుగా నిర్ణయించిన దండకారణ్యం, బిహార్ – జార్ఖండ్ శత్రు దాడులకు ప్రధాన కేంద్రాలుగా నిలిచాయి. ఈ రెండు ప్రాంతాలలో పెద్దెత్తున ప్రజలను బెయిల్‌కు సహితం అవకాశం లేని పాశవిక చట్టాల క్రింద పోలీసులు అరెస్టులు చేస్తున్నారు. జైలు పాలు చేస్తున్నారు. తప్పుడు ఆరోపణలపై జైలుపాలైన వారికి ఎందరికో కఠిన కారాగార శిక్షలు, జీవిత ఖైదులాంటి శిక్షలు విధించడం బాగా పెరిగింది. 2014 మే నెలలో మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసిన 90% వికలాంగుడైన ఢిల్లీ యునివర్సిటీ ప్రొఫెసర్, విప్లవ ప్రజాస్వామిక ఫ్రంటు నాయకులు కా. సాయిబాబాకు పలుమార్లు కోర్టులు బెయిల్ నిరాకరిస్తూ వచ్చాయి. ఆయనను 14 మాసాలు మహారాష్ట్ర జైళ్లల్లో తీవ్ర యిబ్బందులకు గురిచేసి తుదకు చికిత్స కోసం మూడు మాసాల తాత్కాలిక బెయిల్ మంజూరు చేశారంటే పరిస్థితుల తీవ్రత సులబంగానే బోధపడుతుంది. 2013 సెప్టెంబర్‌లో ఢిల్లీ జె.ఎన్.యు విద్యార్థి కా. హేమ్ మిశ్రాను గఢ్‌చిరోలి సి–60 కమాండోలు అరెస్టు చేసి, అనేక తప్పుడు కేసులు ఆరోపించి కటకటాల పాలు చేశారు. జైలులోనూ ఆయనను హింసిస్తూ ఇప్పటికీ కనీసం బెయిలయినా మంజూరు చేయడం లేదు. ఈ మధ్యనే జూన్‌లో దండకారణ్యం (ఛత్తీస్‌గఢ్) లోని మద్దేడ్ ప్రాంతంలో ఆదివాసీ జీవితాలను అధ్యయనం చేయడానికి వచ్చిన ఢిల్లీ పి.ఎచ్.డి. విద్యార్థి వాణి గ్జా గ్జా ను ఆవపల్లిలో ఎస్.పీ.ఓ.లు అరెస్టు చేసి ఎంతగానో వేధించి భయోత్పాతాన్ని సృష్టించడం ఆపరేషన్ గ్రీన్‌హంట్ తీరును దేశ విదేశాలకు తెలిపింది. ఈ ప్రాంతాలలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో ప్రజలను కాల్చి చంపడం, మావోయిస్టులంటూ కట్టుకథలు ప్రసారం చేయడం పోలీసులకు పరిపాటయింది. 2015 జూన్‌లో బిహార్‌లోని గయా జిల్లాలో నాలుగేళ్ల పసిబాలుడు, ఒక ఉపాధ్యాయుడు, మహిళలతో సహా 12 మందిని నడిరోడ్డు మీద పోలీసులు వాహనంలో నుంచి దింపి కాల్చి చంపారు. ఇటు దండకారణ్యంలోని మద్దేడ్ ప్రాంతంలో లంకపల్లి వద్ద తెలంగాణ విప్లవోద్యమంలో పనిచేస్తున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ న్యాయశాస్త్ర విద్యార్థి కా. వివేక్‌తో సహా మరో ఇద్దరు ఆదివాసీ మహిళా కామ్రేడ్స్‌ను పోలీసులు కాల్చిచంపారు. మహిళల పై పోలీసులు జరుపుతున్న క్రూర అత్యాచారాలు అత్యంత భయం గొలిపే విధంగా తయారయ్యాయనీ బీజాపూర్ జిల్లా పొట్టెంలో మహిళలపై జరిగిన దారుణాలు (8 అక్టోబర్–2014) వ్యక్తం చేస్తున్నాయి. ఇక విప్లవకారుల సరెండర్‌ల విషయంలో జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు, కేంద్ర అర్ధ సైనిక బలగాలు ఒకరిని మించి మరొకరు పోటీపడుతున్నారు. అవినీతిలో అందెవేసిన పోలీసులు సాధారణ పౌరులను పట్టుకొని మావోయిస్టులంటూ వేదిస్తూ వారి నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారు. అవార్డులు, రివార్డుల కక్కుర్తితో పోలీసులు తమకు లొంగిపోయినవారి పేర్లపై అప్పటికే ప్రభుత్వాలు ప్రకటించిన లక్షలాది రూపాయల 'తలల వెలలు' సొంతం చేసుకుంటూ, వారిలో నుండి పూర్తిగా దిగజారిన శక్తులను, పార్టీకి ద్రోహులుగా మారిన వారిని ఎస్.పీ.ఓ.లుగా పోలీసు మూకలలో కలుపుకుంటున్న కథనాలు చూస్తున్నాం. మావోయిస్టుల లొంగుబాట్లతో ఉద్యమాల పని అయిపోయిందంటూ తమ పోలీసుల ఆత్మ స్థయిర్యాన్ని నిలుపుకునే ఉన్నతాధికారుల ప్రకటనలు మీడియాలో రోజూ చూస్తునే వున్నాం. ఇందుకు పూర్తి భిన్నంగా, కేంద్ర హోంమంత్రిత్వశాఖ తన రిపోర్టులో మన పార్టీ ప్రధాన కార్యదర్శి నాయకత్వంలో పార్టీ గడ్డు పరిస్థితులలో సైతం దేశంలోని ఇతర విప్లవ సంస్థలను ఐక్యం చేసే కృషి కొనసాగిస్తూ, ఉద్యమంలో విజయాలు సాధిస్తున్నట్లు పేర్కొనడం గమనార్హం. ఈ అంచనాలపై ఆధారపడే భారత యూనియన్ ప్రభుత్వం, వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు మన పార్టీపై మరో పెద్ద దాడికి సిద్ధమవుతోన్న పరిస్థితులలో మనం మన పార్టీ 11వ వార్షికోత్సవాలను జరుపుకోబోతున్నాం. దేశవ్యాప్త మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో 80కి పైగా స్థలాలను ఎంపిక చేసుకున్న పోలీసు, అర్ధ సైనిక బలగాలు ఏ క్షణాన్నైనా మనపై భారీ దాడికి దిగవచ్చు! ప్రస్తుతం జరుగుతున్న వారి సన్నాహాలన్నీ ఆ దిశలోనే ఉన్నాయి. కార్పెట్ సెక్యూరిటీ మరింత విస్తరించింది. రాష్ట్రాల, జిల్లాల సరిహద్దులు సీల్ చేస్తూ కార్డెన్ అండ్ సెర్చ్ దాడులను తీవ్రం చేశారు. ఇప్పటికే మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల్లో జల్లెడ పడుతున్న 108కి పైగా కేంద్ర అర్ధ సైనిక బెటాలియన్‌లకు తోడు ఇపుడు ఇండియన్ రిజర్వు బెటాలియన్‌ల సంఖ్యను గణనీయంగా పెంచేశారు. మానవ రహిత విమానాలు గెరిల్లాల కదలికలను పసిగట్టడానికి ఆకాశంలో రోజూ అనేక చక్కర్లు కొడుతున్నాయి. గ్రౌండ్ ఫోర్స్‌కు పైనుంచి హెలీక్యాప్టర్లు అన్ని రకాల సహాయాన్నందిస్తూ దాడుల తీవ్రతను పెంచుతున్నాయి. గ్రామాలపై రాత్రి వేళల్లో దాడులు చేయడానికి సైనిక హెలీక్యాప్టర్ల రిహార్సల్స్ జరుగుతున్నాయి. ఇక మనం భవిష్యతులో వీటితో తలపడాల్సి వుంటుంది. శత్రువు మనలను అటువైపు నెడుతున్నాడు. మన పార్టీ సాధించిన విజయాలపై ఆధారపడి, నష్టాలను గుణపాఠంగా తీసుకొని సరైన ఎత్తుగడలతో వర్తమాన శత్రు దాడిని ఓడించడానికి అన్ని విధాలా సిద్ధమవుదాం. మన ప్రజలను, విప్లవ ప్రజా సంఘాలను సిద్ధం చేసుకుందాం. ప్రజల విశ్వాసాన్ని అపారంగా చూరగొన్న మన పి.ఎల్.జి.ఎ.ను, దాని రక్షణలో గెరిల్లా బేసులలో పనిచేస్తోన్న 'విప్లవ ప్రజా కమిటీ'లను దెబ్బతినకుండా కాపాడుకుంటూ ప్రత్యామ్నాయ రాజ్యాధికార వ్యవస్థను సుస్థిరం చేసుకుందాం. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను 'ప్రజలపై యుద్ధం'గా స్పష్టంగా పేర్కొంటూ ప్రజా విప్లవోద్యమానికి అండగా నిల్చిన మేధావులను, రచయితలను, కళాకారులను, దేశభక్తులను, పాత్రికేయులను, పర్యావరణవాదులను, ప్రజాస్వామికవాదులను, ఆదివాసీ శ్రేయోభిలాషులను ప్రజల పక్షాన మరింత దృఢంగా నిలవాలని వారికి మరోమారు

విజ్ఞప్తి చేద్దాం. అందుకు పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయి. కావాల్సిందల్లా మానవుల చైతన్యవంతమైన కృషి మాత్రమేనన్నది మరువగూడదు. గత రెండేళ్ళ బోల్షెవీకరణ కెంపెయిన్‌లో మన పార్టీ సాధించిన సత్ఫలితాలు ఆ విషయాన్ని మరింత స్పష్టం చేశాయి.

**కామ్రేడ్స్!**

కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలో ఎన్.డి.ఎ. గద్దెనెక్కి యేడాది దాటింది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ దేశ భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గానికీ, సామ్రాజ్యవాదులకూ ప్రధాన సేవకుడిగా నిస్సిగ్గుగా తన సేవలందిస్తున్నాడు. హిందూ మతోన్మాదుల ఆగడాలకు, హింసాత్మక చర్యలకు మోదీ పాలన ఊపునిస్తోంది. ప్రజల ఆహారపు అలవాట్లను, సంప్రదాయాలను, ధార్మిక స్వేచ్ఛను బ్రాహ్మణ హిందూ ఫాసిజం శాసిస్తోంది. ప్రధాని పదవి చేపట్టిన అనతికాలంలోనే 23 దేశాలను పర్యటించిన మోదీ తన విదేశీ పర్యటనలో 'మేక్ ఇన్ ఇండియా' నినాదానికే అంకితమైపోయాడు. ఆయా దేశాలు ముఖ్యంగా సామ్రాజ్యవాద దేశాలలో బడా కార్పోరేట్ శక్తులతో సమావేశాలు జరిపి వందలాది బిలియన్‌ల డాలర్ల విలువ చేసే డజన్‌ల కొద్ది ఒప్పందాలను కుదుర్చుకొని వచ్చాడు. వాటి అమలు కోసం దేశంలోని పలు ప్రాంతాలు పర్యటిస్తూ దేశ ప్రజలను మభ్య పెడుతున్నాడు. దేశంలోని 65% యువశక్తికి ఉద్యోగాలంటూ ఆశలు చూపుతున్నాడు. ఆకర్షణీయమైన పేర్లతో అనేక పథకాలను ప్రకటిస్తూ ప్రజలను మోసగిస్తున్నాడు. వాస్తవంగా మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతోన్న విధానాలు, ప్రకటిస్తోన్న పథకాలు గత యు.పీ.ఏ. ప్రభుత్వ హయంలో రూపొందినవేనన్నది అసలు విషయం. వీటి రూపకర్తలు ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, విశ్వ వ్యాపార సంస్థ లాంటి అంతర్జాతీయ సంస్థలే కాబట్టి దేశంలో ఏ దోపిడీ ప్రభుత్వాలు అయినప్పటికీ అవి 'నూతన సరళీకృత ఆర్థిక విధానాలను' అమలు చేస్తున్నాయి. వాటి ప్రయోజనాలను ఈడేర్చుతున్నాయి. ఇందులో ప్రధాని మోదీ అత్యంత దూకుడుగా, ప్రమాదకర వేగంతో వ్యవహరిస్తున్నాడు. ఇందుకు ఆయన ప్రభుత్వం దాదాపు గత సంవత్సర కాలంగా భూసేకరణ చట్టం తేవడానికి పడుతున్న పాట్లను ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు! మోదీ ఢిల్లీ గద్దెనెక్కినపుడు తన ప్రమాణ స్వీకార వేడుకలకు దక్షిణాసియా దేశాల నేతలందరినీ ఆహ్వానించి ఎన్నో గొప్పలు పోయాడు. కానీ ఆయన గత వారసత్వంగా వస్తున్న భారత పాలకవర్గాల విస్తరణ వాద విధానాలను కొనసాగిస్తున్నాడనడానికి ఈమధ్యే కోవర్టు ఆపరేషన్‌లో భాగంగా మయన్మార్ దేశ భూభాగంలోకి భారత సైన్యం చొచ్చుకవెళ్ళి అనేకమంది నాగా గెరిల్లాలను అంతమొందించడాన్ని పేర్కొనవచ్చు. దీనిని మన పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది.

యు.పీ.ఏ. హయంలో ప్రజలు అనుభవించిన అధిక ధరల నుంచి నిరుద్యోగం వరకు, ఏ ఒక్క సమస్యను మోదీ ప్రభుత్వం పరిష్కరించలేదు. అనేక ప్రగల్భాలతో, హామీలతో అధికారానికి వచ్చిన మోదీ, భారీ పెట్టుబడుల మానసపుత్రుడిగా దేశ ప్రధాని పదవిని అలంకరించిన మోదీ పై ప్రజలు పెట్టుకున్న భ్రమలు వేగంగా పటాపంచలవుతున్నాయి. అందుకు ఢిల్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి (వాస్తవంగా మోదీకి) ఎదురైన ఘోర పరాభావం మంచి ఉదాహరణగా రుజువైంది. లలిత్ మోదీ కేసులో బయటికి వచ్చిన అవినీతి మోదీ ప్రభుత్వ స్వభావాన్ని ప్రజల్లో నగ్నపరిచింది. పాలకవర్గ పార్టీల మధ్య కుమ్ములాటలు తీవ్ర స్థాయిలో కొనసాగుతున్నవి. గత 15 సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా ఈ యేటి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు అభాసు పాలయ్యాయి. భారత రాష్ట్రపతి భారత ప్రజలకు ఇచ్చిన దేశ స్వాతంత్ర్య వేడుకల సందేశంలో 'అకాడా' గా మారిన చట్ట సభలలో ఏ ఒక్క బిల్లు కూడా ఆమోదం పొందలేదు. పార్లమెంటులోని అధికార, ప్రతిపక్ష పార్టీ సభ్యుల మధ్య జరిగిన కుక్కల కాట్లాట ఘనమైన 'ప్రజస్వామ్యాన్ని' దేశంలోని 125 కోట్ల ప్రజల కళ్లకు కట్టింది. ఈనాటి అధికార బిజెపి పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇంతకన్నా మెరుగ్గా చట్టసభల పరిస్థితి లేదన్నది జగమెరిగిందే! వాస్తవానికి దేశ ప్రజల జీవన్మరణ సమస్యలను పరిష్కరించలేని దోపిడీ వ్యవస్థలలోని చట్ట సభలు ఇంతకు మించి ఇంకేమీ చేయలేవన్న విషయం నానాటికి ప్రజలకు అర్థమైపోతుంది. ఈ పరిస్థితులన్నీ ప్రజలను విప్లవోన్ముఖులను చేయడానికి మనకు ఎంతగానో ఉపకరిస్తాయి. ప్రజలు విప్లవ ప్రత్యామ్నాయ రాజకీయాలనే కోరుకుంటున్నారు. వారికి నాయకత్వం వహించాల్సిన బాధ్యత మనపైననే ఉంది. మనం ఈనాటి పరిస్థితులతో సరిగా వ్యవహరించగలిగితే మన బాధ్యతలను నెరవేర్చిన వారమవుతాం. ఆ శక్తి మన పార్టీకే మాత్రమే ఉందన్న ప్రజల నమ్మకాలను నిజం చేసినవారమవుతాం.

ఈనాటి దేశ పరిస్థితులే కాకుండా అంతర్జాతీయ పరిస్థితులు కూడా విప్లవోద్యమానికి ఎంతో అనుకూలంగా ఉన్నాయి. 2008 లో అమెరికాలో బద్దలైన ఆర్థిక ద్రవ్య సంక్షోభం నుంచి సామ్రాజ్యవాద దేశాలు నేటికి బయటపడలేకపోతున్నాయి. ఆ సంక్షోభ తాకిడికి యూరప్‌లో ఘోరంగా గురైన దేశం గ్రీసు. అది వర్తమాన పరిస్థితులలో రుణసంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంది. 2015 ప్రారంభంలో జరిగిన గ్రీసు ఎన్నికల్లో ప్రజలకు అనేక హామిలిచ్చి అధికారానికి వచ్చిన వామపక్షాల సంస్కరణవాద సంస్థల కూటమి ప్రభుత్వం సిరిజా పార్టీ నాయకుడిగా దేశప్రధాని పదవిని అలంకరించిన అలెక్సిస్ సిప్రాస్ దుష్టత్రయం (ఐ.ఎమ్.ఎఫ్., ఈ.యు., ఇ.సి.బి.) ల ముందు ఎట్టకేలకు సాగిలబడక తప్పలేదు. దుష్టత్రయం విధించిన బెయిల్‌అవుట్ షరతులకు తలవంచకూడదనీ ఆ దేశ ప్రజలు అక్కడ జూలైలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో స్పష్టమైన మెజారిటీతో తీర్పును ఇచ్చినప్పటికీ అక్కడి పార్లమెంటు దానిని బుట్టదాఖలు చేసింది. ఇప్పటికీ 26.2% నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్న ఆ దేశంలోని కార్మికవర్గం విప్లవ పంథాను ఎన్నుకోని పక్షంలో కరుడుగట్టిన మితవాద ఉన్మాద శక్తులకు దారులు పరిచినట్టవుతుంది. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో దాదాపు దశాబ్ద కాలానికి పైగా కొనసాగించి యుద్ధంలో ఎదురైన తీవ్ర ప్రతిఘటనలో అమెరికా

ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా అన్ని చోట్లా, అన్ని రంగాలలో చైనాతో దానికి పోటీ తీవ్రమవుతోంది. ఇంతకాలం తన చెప్పుచేతుల్లో నడిచిన బ్రెట్టన్‌వుడ్ బేబీలకు పోటీగా బ్రిక్స్ దేశాలు తాజాగా వంద బిలియన్ డాలర్ల మూలనిధితో షాంగై ప్రధాన కార్యాలయంగా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ను ఏర్పరిచాయి. ఉక్రెయిన్ విషయంలో రష్యా అనుసరిస్తున్న విధానాలు అమెరికాకు మింగుడు పడకపోతున్నప్పటికీ భరించక తప్పడం లేదు. గత నాలుగేళ్లుగా సిరియాలో ఎదురవుతున్న అనుభవాలు, రానున్న రెండేళ్లలో అమెరికాలో జరుగునున్న అధ్యక్ష ఎన్నికలు, అరబ్ దేశాలలో సున్నీ మత ప్రాబల్య శక్తులతో ఐ.ఎస్.ఐ.ఎస్.గా ఏర్పడిన గెరిల్లాలతో అమెరికా తలపడుతోన్న తీరు దాని బలహీనతలను, సామ్రాజ్యవాదుల మధ్య పెరుగుతోన్న వైరుధ్యాలను వ్యక్తం చేస్తున్నవి. మధ్య ప్రాచ్యంలో బలమైన శక్తిగా నిల్చిన ఇరాన్‌తో అణ్వాయుధాల విషయంలో తుదకు అమెరికా ఒప్పందాలకు దిగిరాక తప్పలేదు. ఆర్థిక, ద్రవ్య సంక్షోభానికి గురైన సామ్రాజ్యవాద దేశాలన్నీ తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్న పరిస్థితులలో అక్కడ కార్మికవర్గ పోరాటాలు బలపడుతూ మావోయిస్టు సంస్థలు ఏర్పడడం అంతర్జాతీయ కమ్యూనిస్టు వుద్యమంలో అత్యంత అనుకూలమైన విషయంగా చూడాలి.

**కామ్రేడ్స్!**

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక, సంక్షోభాలు తీవ్రమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితులలో ఏ దేశంలోనైనా ప్రజల పోరాటాలను దోపిడీ పాలకవర్గాలు సహించలేక పోతున్నాయి. ప్రజా పోరాటాలను హింసాత్మకంగా అణచివేయడానికి పూనుకుంటున్నాయి. కానీ ఆ చర్యలన్నీ కౌంటర్ ప్రోడక్టివ్‌గా తయారవుతున్నాయి. మన దేశ దోపిడీ పాలకవర్గాల పరిస్థితి అందుకు భిన్నంగా ఏమీ లేదు. దేశవ్యాప్త మావోయిస్టు విప్లవోద్యమాన్ని అణచివేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ బడ్జెట్లను కేటాయించాల్సి వస్తోంది. 2014లో దోపిడీ పాలకవర్గాల ఖాకీ బలగాలు పొట్టన పెట్టుకున్న ఒక్కొక్క మావోయిస్టుపై రూ॥80 కోట్లు వెచ్చించాల్సి వచ్చిందనీ మిలిటరీ విశ్లేషకులు లెక్కలు తీస్తున్నారు. కేంద్ర హోంమంత్రిత్వశాఖ తన బడ్జెట్‌లో ఐదవవంతు మావోయిస్టు కార్యకలాపాల అణచివేతకే వెచ్చిస్తుందంటున్నారు. మరోవైపు అపార ప్రాకృతిక వనరులున్న మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో పెట్టిన కార్పోరేట్ పెట్టుబడులు అనేక సంవత్సరాలుగా వినియోగంలోకి రాకుండా పోతున్నాయి. మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో మోదీ 'మేక్ ఇన్ ఇండియా' కు గట్టి ప్రతిఘటన ఎదురవుతోంది. అందుకే ఆయన మావోయిస్టులు రైఫిళ్ళు వదిలి భుజాలపై నాగళ్లు ధరించాలని హితవు పలుకుతున్నాడు. కానీ నాగళ్లు పట్టి దున్నే రైతులు తమ భూముల కోసం, అడవులకోసం, ఆత్మ గౌరవం కోసం మరింత దృఢంగా ఆయుధాలు ఎత్తాల్సిన పరిస్థితులనే పాలకవర్గాలు కల్పిస్తున్నాయి. గత 18 సంవత్సరాలుగా వందకు పైగా పర్యాయాలు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగిస్తూ వచ్చిన ఈశాన్య ప్రాంత పోరాట సంస్థ ఎన్‌ఎస్‌సిఎన్ (ఇసాక్-ముయివా) తుదకు కేంద్ర ప్రభుత్వంతో శాంతి ఒప్పందానికి దిగినా ఆ ప్రాంత ప్రజలు తమ న్యాయమైన సమస్యలపై భారత సైన్యాలతో పోరాడి తీరుతారనీ ఈ మధ్యే జూన్‌లో అక్కడ 18 మంది భారత సైనికులను అంతమొందించిన మాటుదాడి స్పష్టం చేసింది. మరోవైపు మణిపూర్‌లో నూతనంగా ఆవిర్భవించిన మణిపూర్ మావోయిస్టు పార్టీకీ, మన పార్టీకీ మధ్య భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటాలను నిర్వహించడానికి ఒప్పందాలు కుదిరాయి. కశ్మీర్‌లో బి.జె.పి. మద్దతుతో ముఫ్తీ మహ్మద్ సయిద్ ప్రభుత్వాన్ని ఏర్పర్చినప్పటి నుండి అక్కడ ఎడతెరిపి లేకుండా భారత సైన్యాలపై కశ్మీర్ గెరిల్లాల దాడులు జరుగుతూనే వున్నాయి. ఇలాంటి పరిస్థితులలో మనం మన దీర్ఘకాల ప్రజా యుద్ధాన్ని సరైన ఎత్తుగడలతో సాహసంగా పురోగమింపచేద్దాం. విశాల ప్రజారాశులతో కలిసి పోరాడుదాం. నేడు అధికారంలో వున్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక, లౌకిక, అభ్యుదయ, ప్రగతిశీల శక్తులు, సంస్థలు, మత మైనారిటీలు, జాతులతో కలిసి పోరాడుదాం. దేశంలో సాగుతున్న ప్రజా పోరాటాలలో వామపక్ష పార్టీలతో కలిసి పాల్గొని ఆ పోరాటాలను తీవ్రతరం చేద్దాం! ఈ సందర్భంగా వారు బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు వ్యతిరేక ప్రజా పోరాటాలలో కలిసి రావల్సిందిగా మా పార్టీ కేంద్రకమిటీ మరోసారి వారికి విజ్ఞప్తి చేస్తోంది.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోని అనేక దేశాల విప్లవ సంస్థలు భారతదేశంలో పురోగమిస్తోన్న ప్రజా యుద్ధానికి తమ ప్రగాఢ సంఘీభావాన్ని అందచేస్తున్నాయి. అవి మున్నెన్నటికన్నా అధికంగా మన వెంట ఉన్నామంటున్నాయి. ఆ విప్లవ సంస్థలన్నింటికీ మా కేంద్రకమిటీ విప్లవాభివందనాలు తెలియజేస్తున్నది. మనం మరింత ధైర్యసాహసాలతో ప్రజాయుద్ధాన్ని పురోగమింప చేద్దాం! మన పార్టీ 11వ ఆవిర్భావ వార్షికోత్సవాల సందర్భంగా యావత్తు పార్టీ, పి.ఎల్.జి.ఎ., విప్లవ ప్రజా సంఘాల, విప్లవ ప్రజా కమిటీలు, దేశవ్యాప్తంగా విప్లవ ప్రజానీకం సెప్టెంబర్ 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు వారం రోజుల పాటు విప్లవ స్ఫూర్తితో, ఉత్సాహంతో జరపాలి. దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసే లక్ష్యంతో ఈ కెంపెయిన్‌ను నిర్వహించాలి.

కేంద్రకమిటీ మీకు అందిస్తోన్న ఈ సందేశాన్ని విశాల ప్రజారాశుల వద్దకు దృఢ సంకల్పంతో, గట్టి ఆత్మవిశ్వాసంతో తీసుకువెళ్లాలి. అంతిమ విజయం ప్రజలదే! ప్రజాయుద్ధం గెలిచి తీరుతుంది. దోపిడీ పాలకవర్గాల అంతం తప్పదు!

**నినాదాలు:**

* పార్టీ యూనిట్లన్నీ బోల్షెవిక్ పట్టుదలతో 11వ పార్టీ వార్షికోత్సవాలను ఘనంగా  పాటించాలి. శత్రువుకు అభేధ్యమైన రీతిలో పార్టీని నిర్మిద్దాం-కాపాడుకుందాం!

* ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడిస్తూ పార్టీని పటిష్ట పరుచుకుందాం. ప్రజల రాజ్యాధికారాన్ని బలోపేతం చేసుకుందాం!

* బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా, పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా విశాల ప్రజారాశులతో, ప్రజాస్వామిక, లౌకిక, అభ్యుదయ-ప్రగతీశీల శక్తులతో, సంస్థలతో, మత మైనారిటీలతో, వామపక్ష పార్టీలతో కలిసి సమైక్యంగా పోరాడుదాం!

* నిజమైన విప్లవకారుల మధ్య ఐక్యత వర్ధిల్లాలి!

* భారత విస్తరణ వాదానికి వ్యతిరేకంగా విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడుతున్న పీడిత జాతుల ఉద్యమాలతో ఐక్యమవుదాం!

* మార్క్సిజం - లెనినిజం - మావోయిజం వర్ధిల్లాలి!

* అమరవీరులకు జోహార్లు! అమర వీరుల ఆశయాలను కొనసాగిద్దాం!

* సి.పి.ఐ. (మావోయిస్టు) జిందాబాద్!

విప్లవాభివందనాలతో

అభయ్,



అధికార ప్రతినిధి

కేంద్రకమిటీ,

15 ఆగస్టు 2015.

సి.పి.ఐ. (మావోయిస్టు).